


చెరువుల్లో చేపపిల్లలు విడుదల

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి




చేప పిల్లలు విడుదల చేస్తున్న మత్స్యశాఖ అధికారులు

మత్స్యశాఖ ఆధ్వర్యాన జిల్లాలోగల పలు చెరువుల్లో బుధవారం చేప పిల్లలు విడుదల చేశారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ జిల్లా అధికారి ఎన్.నిర్మలాకుమారి మాట్లాడుతూ ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా రాయితీపై చేప పిల్లలను అందజేస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని మత్స్యకారులు, సొసైటీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం మత్స్య శాఖ ఆధీనంలోగల 11 చెరువుల్లో ఫింగర్ లింగు చేప పిల్లలను విడుదల చేశామని చెప్పారు. కార్యక్రమంలో మత్స్య సంపద అభివృద్ధి అధికారి జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమలు కాని అపరాల మద్దతు ధర

కొనుగోలుకు మీనమేషాలు లెక్కిస్తున్న ప్రభుత్వం



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో అపరాల మద్దతు ధర అమలు కావడం లేదు. ప్రభుత్వం తరపున కొనుగోలు చేయకపోవడమే ఇందుకు కారణం. ఇదే అదునుగా వ్యాపారులు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా రైతులు ఎప్పటి మాదిరిగానే నష్టపోవాల్సిన దుస్థితి దాపురించింది. జిల్లాలో రబీ సీజన్ అంటే అపరాలే గుర్తుకు వస్తాయి. ఎందుకంటే, వర్షాధార జిల్లా కావడం వల్ల రబీలో పెద్దగా వరి సాగయ్యే పరిస్థితి లేదు. మరో మాటలో చెప్పాలంటే ఖరీఫ్ సీజన్‌లో వరికి ఎంత ప్రాధాన్యత ఉంటుందో, విస్తీర్ణం రీత్యా అంత కాకపోయినా, రబీలో పెసలు, మినుములే ప్రధాన మైన పంటలు. పెసలు సాధారణ విస్తీర్ణం 26,070 ఎకరాలు కాగా ఈ ఏడాది 14,692 ఎకరాల్లో పండింది. మినుములు సాధారణ విస్తీర్ణం 47,565 ఎకరాలు కాగా, 39,228 ఎకరాల్లో పడింది. సాధారణ విస్తీర్ణంతో పోలిస్తే మినుములు 83శాతం, పెసలు 54శాతం విస్తీర్ణంలో సాగయ్యాయి. పెసలు 54 పంట కోత ప్రయోగాలు చేయాల్సివుండగా ఇప్పటి వరకు 40వరకు పూర్తిచేశారు. మినుములకు సంబంధించి 90 పంట కోత ప్రయోగాలకు గాను 40పూర్తిచేశారు. వీటి ఆధారంగా ఎకరాకు పెసలు 2.45 క్వింటాళ్లు, మినుములు 3.95 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వస్తుందని అధికార యంత్రాంగం అంచనా వేశారు. దిగుబడి కూడా ఆశాజనకంగాను, గతంతో పోలిస్తే సమానంగాను కనిపిస్తోందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వీటిని ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు మీనమేషాలు లెక్కిస్తోంది. గతంలో మార్క్‌ఫెడ్ ద్వారా అపరాలను కొనుగోలు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఈ సారి అటువంటి ఆదేశాలేమీ రాలేదని సంబంధిత విభాగం అధికారులు చెబుతున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు ప్రభుత్వ మద్దతు ధర కన్నా తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది పెసలు క్వింటా రూ.8,682, మినుములు 7,499 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ధరలపై వ్యాపారులు రూ.1000 నుంచి రూ.1500 వరకు తక్కువకు దోచుకుంటున్నారు. ప్రస్తుతం ఈ రెండు పంటలూ కలిపి 25శాతం కోత, నూర్పులు అయ్యాయి. ఇందులో ఎక్కువగా గజపతినగరం, చీపరుపల్లి, రాజాం, బొబ్బిలి వ్యవసాయ సబ్ -డివిజన్ పరిధిలో కనిపిస్తోంది. ఈ ప్రాంతాల్లో ఇప్పటికే వ్యాపారులు కొనుగోలు మొదలెట్టారు. మిగిలిన చోట్ల చేను ఇంకా కోత దశకు చేరుకుంది. ఈనెలాఖరు నాటికి నూర్పులు ముమ్మరమౌతాయి. ఈనేపథ్యంలో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు ముందుకు రాకపోతే వ్యాపారులు అడిగినంతకు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు, ఎపి రైతు సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై బుధవారం రైతు సంఘం నాయకులు జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లారు.

అపరాల కొనుగోలుకు చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు ఎపి రైతు సంఘం లేఖ

మినుము, పెసర పంటలకు గిట్టు బాటు ధర కంటే తక్కువకు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నందున మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేలా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గోపాలం, బి.రాంబాబు కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు లేఖ రాశారు. జిల్లాలో రైతులు పండించిన మినుము, పెసర పంటను మార్కెట్ వ్యాపారులు రైతులు ప్రభుత్వ ప్రకటించిన మద్దతు ధర కన్నా తక్కువకు మినుములు క్వింటా రూ.6500, పెసలు క్వింటా రూ.7వేలుకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల రైతులు నష్టపోతున్నందున మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని కోరారు.

అతీగతి లేని అగ్రహారం భూ సమస్య

- ఏడాది కావస్తున్నా పట్టించుకోని పాలకులు
- ఆందోళనలో అగ్రహారం రైతులు



అగ్రహారం భూములు

ప్రజాశక్తి - జామి

'జామి అగ్రహారం భూ సమస్య పరిష్కారంలో టిడిపి కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎన్నికల ముందు తనను గెలిపిస్తే, అగ్రహార భూముల సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హామీ ఇచ్చారు. కానీ నేటివరకు ఆదిశగా చర్యలు లేకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ టిడిపి పెద్దలైనా పట్టించుకుంటారంటే, వారికి కాంట్రాక్ట్ పనులపై ఉన్న శ్రద్ధ రైతు సమస్యలపై లేదని అంటున్నారు.

మండల కేంద్రమైన జామి అగ్రహార భూముల సమస్య తాతల తండ్రుల కాలం నుంచి రైతులను వెంటాడుతోంది. కళ్ళముందు భూములు ఉన్న, ఎటువంటి హక్కులూ లేకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పాలకులు మారుతున్నారు తప్పా...అగ్రహార భూముల సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. ఈ నేపథ్యంలోనే 2022 మే 25న భూములకు అప్పటి తహశీల్దార్ పబ్లిక్ నోటిఫికేషన్ వేసి అన్నదాతల్లో ఆశలు రేపారు. ఇప్పటికైనా భూసమస్య పరిష్కారానికి నోచుకుంటుందని అనుకున్నారు. ఈ పక్రియ జరిగి సుమారుగా ఏడాది పైన కావస్తున్నా... అగ్రహారం పై ఎటువంటి అడుగులూ ముందుకు పడలేదు. ఎన్నికల ప్రచారంలో సమస్యను పరిష్కరిస్తానని స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి హామీ ఇచ్చినప్పటికే, ఇంత వరకు దానిపై ఒక్క సారైనా స్పందించలేదు.

రెవెన్యూ సదస్సుల్లో వినతులు

జామి మండల కేంద్రంలో సుమారుగా 2600 ఎకరాల వరకు ఇనాము భూములు (అగ్రహారం) కింద ఉన్నాయి. వీటికి హక్కులు కల్పించాలని రైతులు ఏళ్లుగా ప్రజాప్రతినిధులను, అధికారులను కోరుతున్నారు. అధికారంలోకి వచ్చిన నాయకులు పట్టించుకోక పోవడంతో ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో రైతులు వినతులు అందజేశారు. సదస్సుల్లో మండల వ్యాప్తంగా 585 వినతలు రాగా, అందులో మ్యూటేషన్ కోసం చేసిన వినతులే ఎక్కువ. జామి అగ్రహారం భూ సమస్యపైన పది మంది వరకు ఫిర్యాదు చేశారు. గత తహసీల్దార్ విడుదల చేసిన నోటిఫికేషన్‌పై 30రోజుల్లో అభ్యంతరాలు తెలపాలని పేర్కొనడంతోఅప్పట్లో సుమారుగా 90శాతం మంది రైతులు అభ్యంతరాలు తెలియజేశారు. కానీ అధికారుల నుంచి మాత్రం ఇప్పటికీ ఎటువంటి సమాధానాలూ లేవు.

చెరువు ఆక్రమణ పైన ఫిర్యాదు

సాధారణ రైతు ఏళ్లుగా భూములు సాగుచేసుకుని హక్కుల కోసం ఎదురు చూస్తున్న నేపథ్యంలో అక్రమార్కులకు మాత్రం చెరువులకు సైతం పాసుపుస్తకాలు ఇచ్చేసిన పరిస్థితి తెలిసిందే. ఒకవైపు ఇరిగేషన్ అధికారులు చెరువు అక్రమణలో ఉంది, ఆక్రమణ తొలగించి చెరువుకు సరిహద్దులు గుర్తించాలని, అధికారులకు అనేక మార్లు లెటర్లు పంపినా, పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలోనే కొంత మంది రైతులు రెవెన్యూ సదస్సుల్లో చెరువు అక్రమణపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కానీ అధికారులు పట్టించుకోవడం లేదు.



మృతుడి తండ్రిని పరామర్శిస్తున్న బేబినాయన

హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

అనుమానితులను విచారిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని నెమలాం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కోనారి ప్రసాద్ హత్య ఘటనపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. సిఐ నారాయణరావు ఆధ్వర్యాన ప్రత్యేక పోలీసు బృందాలు పలు కోణాల్లో సమాచార సేకరణ చేస్తున్నారు. అయినప్పటికీ ఏ విధమైన సమాచారమూ ఇప్పటివరకు రాలేదని సిఐ తెలిపారు. నెమలాం-బూరి పేట గ్రామాలకు సంబంధించి అనుమానితులను పిలిపించి విచారణ చేస్తున్నట్లు చెప్పారు. హత్యకు గురైన ప్రసాద్ కుటుంబంతో ఎవరికైనా తగాదాలు ఉన్నాయా, ఇంకేమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రసాద్‌కు ఇంకా పెళ్లికాకపోవడంతో ఎవరితోనైనా ప్రేమ వ్యవహారాలు, అక్రమ సంబంధాలు ఉన్నాయా అనే కోణాన్ని కూడా పరిశీలిస్తున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సిఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి బేబినాయన పరామర్శ

కోనారి ప్రసాద్ కుటుంబాన్ని బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన బుధవారం పరామర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి భయంకరమైన సంఘటనలు జరగడం చాలా దురదృష్టకరమని అన్నారు. నిందితులు ఎంతటి వారైనాప్పటికీ తక్షణమే కేసును ఛేదించి బాధిత కుటుంబానికి తగు న్యాయం జరిగించేలా చూడాలని కోరారు. ఎమ్మెల్యేతో పాటు మండల పార్టీ అధ్యక్షులు ఎన్.వెంకట్ నాయుడు, ఎన్.వెంకటేశ్వరరావు, పలువురు సర్పంచులు పాల్గొన్నారు

రహదారులపై నిఘా నేత్రం

- ముఖ్యమైన ప్రదేశాల్లో సిసి కెమెరాల ఏర్పాటు
- రూ.5 లక్షలు మంజూరు చేసిన కలెక్టర్ అంబేద్కర్
- 12 హిట్ అండ్ రన్ కేసులకు కమిటీ ఆమోదం



ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలోని ప్రధాన రహదారులపై సిసి కెమేరాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపాలిటీలు, మేజర్ పంచాయతీలు, జాతీయ రహదారిపై ముందుగా కెమేరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. హిట్ అండ్ రన్ జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం జరిగింది. గుర్తుతెలియని వాహనాలు ఢీకొని మృతి చెందిన, క్షతగాత్రులుగా మారిన మొత్తం 12 కేసులపై సమగ్రంగా చర్చించి ఆమోదించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, ప్రమాదాల నివారణపై ముందుగా దృష్టి సారించాల్సి ఉందని సూచించారు. దీనికోసం డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ నిబంధలను కఠినతరం చేయడం, ప్రమాద కారకుల లైసెన్సులను సస్పెండ్ చేయడం, రహదారి నియమాలపై అవగాహన కల్పించడం తదితర చర్యలను చేపట్టాలని సూచించారు. ప్రధాన రహదారుల్లో సిసి కెమేరాలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదానికి కారణాలను, కారకులను గుర్తించేందుకు ఉపయోగపడటంతో పాటు, నేరాల నియంత్రణకు కూడా దోహద పడుతుందని అన్నారు. గుర్తుతెలియని వాహనాలు ఢీకొని వ్యక్తులు మరణించిన సంఘటనల్లో, ఇతరత్రా కారణాలు ఏమైనా ఉన్నాయోమోనన్న కోణంలో కూడా లోతుగా దర్యాప్తు చేయాలని సూచించారు. రాజాం, చీపురుపల్లి ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి పెట్టాలన్నారు. ప్రమాద కారకులను గుర్తించేందుకు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీలు, జాతీయ రహదారులపై సిసి కెమేరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీల ద్వారా, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయితీ శాఖ ద్వారా వీటిని ఏర్పాటు చేయాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్, ఈఒపిఆర్‌డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించి, సిసి కెమేరాలు ఏర్పాటు చేసే ప్రదేశాలను ఖరారు చేయాలని ఆర్‌డిఒలు, డిఎస్‌పిలకు సూచించారు. కెమేరాల ఏర్పాటు 15 రోజుల్లో పూర్తి కావాలని ఆదేశించారు. జాతీయ రహదారులు, ఇతర ప్రాంతాల్లో సిసి కెమేరాలను ఏర్పాటు చేసేందుకు రూ.5 లక్షలను కలెక్టర్ మంజూరు చేశారు. సమావేశంలో ఎఎస్‌పి సౌమ్యలత, డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, డిటిఒ మణికుమార్, డిఎంఅండ్‌హెచ్‌ఒ జీవనరాణి, డిపిఒ టి.వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒలు, డిఎస్‌పిలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఎంఇఒకు సిఐటియు నాయకుల వినతి

ప్రజాశక్తి - జామి



ఎంఇఒకు వినతినిస్తున్న సిఐటియు నాయకులు

మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపు లను నిరోధించాలని, కూటమి ప్రభుత్వం ప్రకటించిన కొత్త మెనూకి అనుగుణంగా ఛార్జీలు పెంచాలని, బకాయి బిల్లులు, గౌరవవేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల విద్యాశాఖ అధికారి గంగరాజుకు సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ మాట్లాడుతూ, పిల్లలకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో మధ్యాహ్నభోజన పథకాన్ని 2003లో తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. పథకం నిర్వహణ బాధ్యతను డ్వాక్రా సంఘాలకు అప్పగించిందని తెలిపారు. 22ఏళ్లగా ఎలాంటి కష్టం వచ్చినా, ప్రభుత్వం ఎన్ని నెలలు బిల్లులు, గౌరవవేతనం చెల్లించకపోయినా అప్పులు చేసి నిరంతరంగా పిల్లలకు వండి పెడుతున్న పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం గౌరవవేతనం రూ.3వేలు ఇస్తున్నారని,(రోజుకు వంద రూపాయలు) ఇది ప్రభుత్వం చెప్పిన రోజువారీ కూలి కంటే, ఉపాధివేతనం కంటే తక్కువ కాబట్టి, ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం ధరలకు అనుగుణంగా కొత్తమెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు, స్కూల్ ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ వర్కర్లు కొండమ్మ, విజయ, నాగమణి, అరుణ, సత్యవమ్మ పాల్గొన్నారు.

'ఆయిల్‌పాం' టన్ను ధర రూ. 20,050

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ గెల టన్ను ధర రూ.20,050గా నిర్ణయించిందని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎ.వి.యస్.వి. జమదగ్ని తెలిపారు. జిల్లాలో గల ఆయిల్ పామ్ కంపెనీలకు రైతులు సరఫరా చేసిన ఆయిల్ పామ్ గెలలకు ప్రభుత్వం నిర్ణయించిన సమయానికి, ధరకు చెల్లింపులు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కంపెనీల యాజమాన్యాలను కోరారు. ఈ విషయాన్ని ఆయిల్ పామ్ రైతులు గమనించాలన్నారు. నీటి సదుపాయం ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తి చూపాలని తెలిపారు. ఆయిల్ పామ్ మొక్కలకు వందశాతం రాయతీని ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. ఆయిల్ పామ్ పంట నిర్వహణకు హెక్టారుకు రూ.5,250 రాయితీ చొప్పున నాటిన మొదటి నాలుగు సంవత్సరాలు రైతులకు అందజేస్తామని తెలిపారు.

సీతంలో కిక్కేర్ టెక్నాలజీ క్యాంపస్ డ్రైవ్

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక గాజులరేగ పరిధిలోగల సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కిక్కేర్ టెక్నాలజీ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. బి.టెక్, ఎంబిఎ, బిబిఎ విద్యార్థులు హాజరయ్యారు. వీరికి స్క్రీనింగ్ టెస్ట్, టెక్నికల్, హెచ్.ఆర్ ఇంటర్వ్యూ నిర్వహించి 20 మంది విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. ఎంపికైన విద్యార్థులకు 3లక్ష ల ప్యాకేజీ తో అవకాశాలు కల్పించారు. ఈ ఎంపిక ప్రక్రియను కిక్కేర్ టెక్నాలజీ సిఇఒ తన్వి దామిజా, డైరెక్టర్ సోంనాథ్ దామిజా, హెచ్.ఆర్ నిధి చంద్రవనిషి, టెక్నికల్ మేనేజర్ అభిషేక్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, వాటికోసం తగిన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.



చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్

రహదారులను ఆక్రమిస్తే చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రహదారులను ఆక్రమించి ప్రజా రవాణాకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. బుధవారం 20వ డివిజన్ డాక్టర్ బిసెంట్ స్కూల్ నుండి ప్రారంభమైన పర్యటనలో ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించే ప్రయత్నం చేశారు. స్థానిక సమస్యలను తెలుసుకుని సాధ్యమైన పనులను అక్కడికక్కడే పరిష్కరించారు. తాగునీరు వృథాగా పోతున్న విషయాన్ని గమనించి, వృథా చేయరాదని మహిళలకు సూచించారు. ఎండాకాలంలో నీటి ఎద్దడికి గురికాకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని, అయినా ప్రజలు కూడా తమకు సహకరించాలని కోరారు. రహదారులను ఆక్రమించి బడ్డీ కొట్లు ఉండరాదని స్పష్టం చేశారు. టిఫిన్ దుకాణాలు, తోపుడు బళ్ళు ఉండడానికి గమనించి వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనంతరం అన్నా క్యాంటీన్ ను పరిశీలించారు. ఆయన వెంట టిపిఆర్‌ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అద్దె చెల్లించని షాపులను సీజ్ చేసిన రెవెన్యూ సిబ్బంది

దీర్ఘకాలంగా అద్దె బకాయిలు ఉన్న దుకాణాలను బుధవారం రెవెన్యూ విభాగం సిబ్బంది మూసివేసి తాళాలు వేశారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో చాలా కాలంగా అద్దె బకాయిలు ఉన్న వాటికి రెడ్ నోటీసులు జారీ చేసినప్పటికీ అద్దెలు చెల్లించకపోవడంతో దుకాణాలను మూసివేసి తాళాలు వేశారు. మొత్తం 7 దుకాణాలను మూసివేసినట్లు కమిషనర్ నల్లనయ్య తెలిపారు. సకాలంలో అద్దెలు చెల్లించకపోతే అపరాధ రుసుములతో అద్దెలు వసూలు చేస్తామన్నారు. ఇటీవల 15 షాపులను సీజ్ చేశామని, వారిలో 5 షాపులు అద్దెలు చెల్లించడంతో తిరిగి తాళాలను ఇచ్చి దుకాణాలు తెరిపించామని చెప్పారు. వాస్తవానికి అద్దెబకాయిలు ఒకనెల కన్నా మించి ఉన్నట్లయితే అటువంటి దుకాణాలను జీవో ఎంఎస్ నెంబర్ 56 ప్రకారం లీజును రద్దు చేసే అధికారం నగరపాలక సంస్థకు ఉందని తెలిపారు. బహిరంగ వేలం ద్వారా ఇతరులకు కేటాయించే అవకాశం కూడా ఉందన్నారు. ప్రతినెలా అద్దె చెల్లించాలని తెలిపారు.

ప్రీ ఫైనల్ పరీక్షను పరిశీలించిన డిఇఒ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిఇఒ మాణిక్యం నాయుడు

విజయనగరం, డెంకాడ మండలాల్లోని ప్రభుత్వ జెడ్పీ హైస్కూళ్లలో జరుగుతున్న పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలను డిఇఒ యు.మాణిక్యం నాయుడు పరిశీలించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్నం బోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి లో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఇది ప్రాక్టీస్ లాంటిదని, ప్రీ ఫైనల్ పరీక్షలు పబ్లిక్ పరీక్షలు మాదిరిగానే నిర్వహించి విద్యార్థుల్లో పరీక్ష పట్ల భయాన్ని పోగొట్టేందుకు తోడ్పడుతుందని అన్నారు.

గిరిజన చట్టాలకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట



నిరసన తెలుపుతున్న గిరిజనులు, నాయకులు

గిరిపుత్రుల హక్కులకు, చట్టాలకు రక్షణ కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో తాహశీల్దార్ అరుణకుమారికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న గిరిజన గ్రామాలను ఐటిడిఎ పరిధిలో చేర్చాలని, గిరిపుత్రుల హక్కులకు, చట్టాలకు రక్షణకల్పించాలని, గిరిజన జాతుల అస్తిత్వాన్ని కాపాడాలని విద్య, వైద్యం జీవనప్రమాణాలను మెరుగుపరచి గిరిజనుల నివాస ప్రాంతాల్లో మినీ వైద్యశాలలో ఏర్పాటు చేయాలని, గిరిజనులు ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేసి గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం ఎస్ అర్జున్, జి సన్యాసిరావు, కె.అరుణ్ కుమార్, దారపర్తి పంచాయతీ సర్పంచ్ సన్యాసిరావు, జి సత్యనారాయణ, జి నాయుడు, ఎస్.రాము, జి.సన్యాసిరావు, జి.సాంబ, ఎం. నాగేశ్వరరావు, వి.బిసు, జి.రాధ, జి. చిలకమ్మా తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న జిల్లా జడ్జి సాయి కల్యాణ్‌చక్రవర్తి

జీవితాల్లో వెలుగునిచ్చేది విద్యుత్తు ఉద్యోగులు

1104 యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకలో జిల్లా జడ్జి సాయికళ్యాణ్‌చక్రవర్తి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజల జీవితాలకు వెలుగునిచ్చేది విద్యుత్ ఉద్యోగులని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. బుధవారం 1104 యూనియన్ కార్యాలయంలో జరిగిన ప్లాటినం జూబ్లి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యుత్ ఉద్యోగులు ప్రాణాలు తెగించి ప్రజలకు వెలుగునిచ్చే ఉద్యోగులు అన్నారు. రాత్రి ,పగలు ఏ సమయంలోనైనా విద్యుత్ సమస్య వస్తే వెంటనే వచ్చి సమస్య పరిష్కారం చేసే ప్రధాన శాఖ విద్యుత్ శాఖ అన్నారు. విద్యుత్ ఉద్యోగులు చేసే సేవలు వెలకట్టలేనిది అన్నారు. అటువంటి శాఖలో యూనియన్ గా ఏర్పడి 75 ఏళ్ల ప్లాటినం జూబ్లి వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఎపి ఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ముvvల లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు సమస్యలు పరిష్కారంలో ఎప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. ఉద్యోగులు ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో 1104 యూనియన్ రీజనల్ అధ్యక్షులు వంగపండు లక్ష్మణ, కార్యదర్శి సూరగాల లక్ష్మణరావు, నాయకులు వరప్రసాద్, రాజేంద్ర ప్రసాద్, ఇఇ త్రినాధరావు, రూరల్ ఇఇ సురేష్, విద్యుత్‌శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం సీనియర్ సంఘం నాయకులకు సత్కరించారు.

ఎంవిజిఆర్, సిటిటిసి మధ్య అవగాహన ఒప్పందం

డెంకాడ: ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల పరిశ్రమ-సంసిద్ధతను పెంపొందించడానికి బుధవారం భువనేశ్వర్‌కు చెందిన సెంట్రల్ టూల్ రూమ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ (సిటిటిసి)తో అవగాహన ఒప్పందం చేసుకున్నారు. విద్యార్థులను ఆచరణాత్మక నైపుణ్యంతో సన్నద్ధం చేయడానికి పరిశ్రమ-ఆధారిత నైపుణ్య శిక్షణ, ఇంటర్న్‌షిప్ అవకాశాలు, సాంకేతిక నిపుణుల శిక్షణా కార్యక్రమాలను అందించడం ఈ అవగాహన ఒప్పందం ముఖ్య లక్ష్యమని ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ పిఎస్.సీతారామరాజు తెలిపారు. ఈ భాగస్వామ్యంలో పోటీ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం, పేటెంట్ దాఖలు ప్రక్రియలో ఎంవిజిఆర్ కళాశాల అధ్యాపకులకు సహాయం చేయడం, ఆవిష్కరణ, వ్యవస్థాపకతను ప్రోత్సహించడం వంటి నిబంధనలు కూడా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటిటిసి సీనియర్ ఇంజనీర్, ఎఐ విభాగం హెడ్ డాక్టర్ రీతు మైతీ, ఎంవిజిఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, మెకానికల్ విభాగం హెచ్ఒడి డాక్టర్ ఎన్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిరణ్‌కు రూ.10 వేలు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న అప్పలనాయుడు

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం దండి రవి, సుజాతల కుమారుడు కిరణ్ వయసు (6) అనారోగ్యం బారినపడి విశాఖపట్నం కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకుని సర్పంచ్ బుద్ద చిన్నమ్మలు, అప్పలనాయుడు పరామర్శించి రూ. 10వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. సంబంధిత వైద్యులను పూర్తిగా కోలుకోవడానికి ఎంత ఖర్చు అవుతుందని సర్పంచ్ దంపతులు అడుగగా హైదరాబాదులో ఉన్న వైద్య నిపుణులకు నివేదిక పంపించామని సుమారు పది లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. దీంతో ప్రతి ఒక్కరూ స్పందించి కిరణ్‌కు ఆర్థిక సాయం అందించాలని కుటుంబ సభ్యులతో పాటు సర్పంచ్ దంపతులు కోరారు. సాయం చేయాలనుకునే వారు 9866394797కు ఫోన్‌పే చేయాలని కోరారు.

ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటేలో ప్రతిభ

కొత్తవలస: రెండవ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పది మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారని కోచ్ సూర్య నూకరాజు తెలిపారు. ఫిబ్రవరి రెండో వారంలో జరిగిన ఈ పోటీల్లో మండలానికి చెందిన దేవకి లత కాటాలో బ్రాంచ్ మెడల్, కుంటిలో సిల్వర్ మెడల్, ఈ.సాయిలక్ష్మి ప్రసన్న కాటా అండ్ కుమిటిలో సిల్వర్ మెడల్, పి.నాగ వెంకట వంశీ కాటా అండ్ కుమిటీలో బ్రాంచ్ మెడల్, పి.గౌరీ ప్రసన్నకి కాటాలో కాంస్యం, కుమిటీలో సిల్వర్ మెడల్, ఎం. గోవర్ధన్ కాటా అండ్ కుమిటీలో కాంస్యం, కె. జయశ్రీ కాటాలో సిల్వర్, కుమిటీలో కాంస్యం, కె. నేహల రోషన్‌కు కాటాలో కాంస్యం, కుమిటీలో గోల్డ్ మెడల్, ఎం దేవ హర్ష కాటాలో గోల్డ్ మెడల్ సాధించారని తెలిపారు. క్రీడాకారులను బుధవారం కోచ్ అభినందించారు.

బూరాడలో వికలాంగుల సర్వే


రేగిడి: మండలంలోని బూరాడలో వికలాంగుల వివరాలను సేకరించేందుకు మండల బృందం బుధవారం సర్వే ప్రారంభించింది. ప్రతి ఇంటికీ వెళ్లి పక్కాగా సర్వే చేపడుతున్నట్లు, ఈనెల 24వ వరకు ఈ సర్వే ఉంటుందని బూరాడ ఆరోగ్య కేంద్రం విస్తరణాధికారి రాధాకృష్ణ, సిహెచ్ఒ సుందరేశ్వరరావు, న్యాయవాది జయలక్ష్మి తెలిపారు. పుట్టిన బిడ్డ నుండి 18 సంవత్సరాల వరకు పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకాహార లోపాలు, బాల్యంలో వచ్చే వ్యాధులు, అభివృద్ధి లోపాలతో బాధపడే వారిని గుర్తించి విజయనగరం ప్రారంభ దశ చికిత్స కేంద్రం (డైస్)కు వైద్యం కోసం తరలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసి సూర్యారావు, వైద్య ఆరోగ్యశాఖ ఐసిడిఎస్, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

వైభవంగా సీతగుండం యాత్ర

రామభద్రపురం: మండల పరిధిలోని పాడివానివలస శివారులో మాఘ పౌర్ణమి సందర్భంగా సీత గుండం యాత్ర బుధవారం వైభవంగా నిర్వహించారు. కొండల్లో వెలసిన సీతారామ లక్ష్మణులకు విశేష పూజలు చేశారు. ఈ సీత గుండం యాత్రకు ఈ ప్రాంత ప్రజలతోపాటు దూర ప్రాంతాలకు చెందిన భక్తులు కూడా వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే బేబినాయన ఆర్థిక సహకారంతో పులిహోర ప్రసాద వితరణ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ఎస్ఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

కావలి కుటుంబానికి పరామర్శ

సంతకవిటి: మండలంలోని కావలి మాజీ వార్డు మెంబెర్ కావలి జయలక్ష్మి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో బుధవారం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు, సర్పంచ్ తమ్మినైనా రవీంద్ర నాయుడు కలిసి జయలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు కావలి మురళి కృష్ణ మాస్టర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.రాము, టి.అమ్మినాయుడు, వెంకట్, పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సిరిపురపు

ఏర్పాట్లను పరిశీలించిన బేబినాయన

బొబ్బిలి: రాజా కళాశాల మైదానంలో ఈనెల 19న జరగనున్న బాడీ బిల్డింగ్ పోటీల ఏర్పాట్లను ఎమ్మెల్యే బేబినాయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాడీ బిల్డింగ్ పోటీలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. పోటీలు విజయవంతం చేసేందుకు సంపూర్ణ సహాయసహకారాలు అందిస్తామని బేబినాయన చెప్పారు. ఆయనతో క్రీడాకారులు ఉన్నారు.

సింగరాయిలో 104 వైద్య సేవలు

వేపాడ: మండలంలోని సింగరాయిలో బుధవారం 104 ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా 56 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందించినట్లు వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి ఎ.ధరణి తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరాయి హెల్త్ సెంటర్ సిహెచ్ఒ పార్థసారథి, ఎఎన్ఎం వెంకటలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

వంగర: మండలంలోని పాతమరువాడ టేకు తోటల్లో విశాఖకు చెందిన వసాది శ్రీరాములు(52) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతని బంధువుల ఇంటికి మంగళవారం వచ్చాడు. మద్యానికి బానిసైన ఆయన జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట జాతీయ రహదారి పక్కన బుధవారం తెల్లవారు జామున టారాస్ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు గాయాలు కాగా పెద్ద ప్రమాదం తప్పింది. క్లీనర్ తెలిపిన వివరాల మేరకు విశాఖ పోర్ట్ నుంచి ఒడిశా వెళ్తున్న లారీ మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. అర్ధరాత్రి పెద్ద శబ్దం రావడంతో స్థానికులు చేరుకుని 108కి సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో డ్రైవర్‌ను బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

రాజాం: నూతన ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలోని దుకాణాలు వెనుక ఉన్న డ్రైన్‌లో మండలంలోని రాయవలస గ్రామానికి చెందిన మజ్జి రమణ (34) పడి బుధవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న సిఐ అశోక్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం రాజాం ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. మద్యం మత్తులో కాలువలో పడి మృతి చెంది ఉంటాడని అంచనా వేస్తున్నారు.

పేట్రేగిపోతున్న పెట్రోల్ దొంగలు

బొబ్బిలి: పట్టణంలో పెట్రోల్ దొంగలు పెట్రేగి పోతున్నారు. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలలో పెట్రోల్‌ను దొంగిలిస్తున్నారు. షిరిడి సాయిబాబు ఆలయం ఎదురుగా ఉన్న ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న ద్విచక్ర వాహనాలలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పెట్రోల్ తీసేసారు. పెట్రోల్ దొంగిలిస్తున్న వీడియో సీసీ కెమెరాలలో రికార్డు అయింది. నాయుడుకాలనీ, మెహర్ కాలనీ, వెలమవారివీధి, సాయి నగర్, స్వామివారి వీధి తదితర ప్రాంతాల్లో పెట్రోల్ దొంగిలిస్తున్నారు. పెట్రోల్ దొంగలపై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని పోలీసులను ప్రజలు కోరుతున్నారు.

రైతుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ప్రతీ రైతు పార్మర్ రిజిస్ట్రేషన్ యాప్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి విటి రామారావు అన్నారు. బుధవారం మండలంలో పేరాపురం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పొలంలో పలు వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు 11 అంకెల గుర్తింపు సంఖ్య వస్తుందని దానికి అనుగుణంగానే వ్యవసాయ సంబంధిత పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. రైతు భరోసా కేంద్రం వద్దకి వెళ్లి ఈఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో నమోదు చేయించుకోవాలని కోరారు. ఎన్‌పిఎస్ఎస్‌యాప్ ప్రతి రైతు కూడా డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఈ ఎన్‌పిఎస్ఎస్ యాప్ ద్వారా రైతు తమ పొలంలో ఏదైనా పురుగు, లేదా తెగులు కానీ వచ్చిన ఎడల అక్కడే వారి ఫోన్ నుండి ఫోటో తీసి పంపితే వెంటనే దానికి సంబంధించిన రెమిడీ చేస్తామన్నారు. మైక్రో ఇరిగేషన్‌లో ఇప్పుడు సబ్సిడీలో స్ప్రింక్లర్ సెట్‌లు ఉన్నాయని రైతులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో మాజీ సర్పంచ్ బొంతు రవి, రైతులు, ఎఒ నీలిమ పాల్గొన్నారు.



డెంకాడ: రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

నెల్లిమర్ల: మండలంలోని అలుగోలు, గుషిణి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ ఎం. పూర్ణిమ ఆమె మొక్కజొన్న పంటలను పరిశీలించి సస్య రక్షణ చర్యలు వివరించారు. అనంతరం భూమి ఉన్న ప్రతీ రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని దీనికి గ్రామ వ్యవసాయ సహాయకులను 1బి, ఆధార్, ఆధార్ లింక్ ఉన్న మొబైల్ నెంబర్‌తో సంప్రదించాలని కోరారు. గుర్తింపు ద్వారా వ్యవసాయ సంక్షేమ పథకాలు లబ్ది చేకూరుతుందని రైతులకు అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఎ మౌనిక, ప్రవీణ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని రామచంద్రాపురంలో రైతులు సాగు చేస్తున్న వేరుశనగ, నువ్వుల పంటలను ఎఒ కె.శిరీష బుధవారం పరిశీలించారు. ఇందులో భాగంగా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి వేరుశనగ పంటకు పొగాకు లద్దే పురుగు తెగులను గుర్తించి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు పలు సూచనలు చేశారు. పూత సమయంలో జిప్సం వేస్తే అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు. రైతులు పాల్గొన్నారు.

గజపతినగరం: ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని ఎఒ సిహెచ్ ధనలక్ష్మి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి గోవిందమ్మ అన్నారు. బుధవారం కొనిస గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీ కాలంలో సాగు చేస్తున్న వరి పంట మీద యాజమాన్యం చర్యలు గురించి వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే పథకాలు రైతులకు వర్తించాలన్న, రాయితీపై రైతులు డ్రిప్, తుంపర్ల సేద్యం పరికరాలు కావాలన్నా రైతు సేవ కేంద్రం సందర్శించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామా వ్యవసాయ సహాయకులు భార్గవి, రైతులు పాల్గొన్నారు.

కనీస పింఛను రూ.9వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఈపిఎస్ పింఛన్ దార్లకు కనీస పింఛన్ రూ.9వేలు ఇవ్వాలని ఈపిఎస్ పింఛన్‌దార్ల సంఘం జిల్లా నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం కనీస పింఛన్ రూ.9వేలు ఇవ్వాలని కోరుతూ ఈపిఎస్ పింఛన్‌దార్ల సంఘం ఆధ్వర్యంలో స్థానిక పోస్టాఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఈపిఎస్, రిటైర్డ్ కార్మికులకు కనీస పింఛన్ ఇవ్వాలన్నారు. దేశ వ్యాప్తంగా ఈపిఎఫ్-95 పెన్షనర్ల సంఖ్య 78.49లక్షల మంది ఉన్నారని మోడీ ప్రభుత్వం కనీస పింఛన్ పెంపుదలకు నిధులు లేని కారణంగా పెంచలేక పోతున్నామని అబద్దాలు చెప్పడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఈపిఎస్ పింఛన్‌దార్ల సంఘం నాయకులు మొయిద పాపారావు, పద్మనాభం, అప్పలసూరి, పింఛన్‌దార్లు ఎం. సన్యాసి రావు, ఎం. మెహన్, ఎన్. సత్యనారాయణ, ఎస్. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు, పెన్షనర్లు

మా ధాన్యాన్ని కొనుగోలు చేయండి

మజ్జి రాముడు పేట, అప్పాపురం రైతుల వినతి

ప్రజాశక్తి- రేగిడి

ఆరుగాలం శ్రమించి ఖరీఫ్ వ్యవసాయం చేసినప్పటికీ ఇంతవరకు రైతు సేవ కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం ఎంతవరకు సమంజసమని, ధాన్యం కొనుగోలు చేయండి మహాప్రభో అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అప్పా పురం, మజ్జిరాముడుపేట గ్రామ రైతులు దాన్యం కొనుగోలకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సంకిలి సచివాలయం వ్యవసాయ సహాయకులు జొన్నాడ సుమకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ రెండు గ్రామాల్లో సుమారు 15 మంది రైతులకు సంబంధించి 50 మెట్రిక్ టన్నులు ధాన్యం నూర్పు చేసి, కల్లాల్లో సిద్ధంగా ఉన్నాయని వాటిని కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని సర్పంచ్ కరణం నిర్మలా శ్రీనివాసరావు, రైతులు డిమాండ్ చేశారు. స్పందించకపోతే ధర్నాకు రైతులు సిద్ధపడతారని హెచ్చరించారు.



వినతి పత్రాన్ని అందిస్తున్న రైతులు

పల్లెపండగ పనుల పరిశీలన

వేపాడ: మండలంలోని సోంపురం ఎస్‌టి కాలనీలో శరవేగంగా జరుగుతున్న పల్లె పండగ పనులను బుధవారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పరిశీలించారు. గ్రామంలో రక్షిత మంచినీటి ట్యాంకు వద్ద రక్షిత గోడ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. గ్రామంలో సిసి రోడ్లకు ఇరువైపులా ఉన్న కాలువలలో పేరుకుపోయిన పూడికను తొలగించి మురుగునీరు నిల్వ ఉండకుండా పైకి పోయే విధంగా చర్యలు చేపట్టారు.

మానసిక ఒత్తిడిపై అవగాహన

నెల్లిమర్ల: సతివాడ పిహెచ్‌సిలో వైద్యాధికారి కె.సాయిరాం ఆధ్వర్యంలో బుధవారం స్కూల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లా సైకాలజిస్టు రాజు విద్యార్థులకు మానసిక ఒత్తిడి లక్షణాలపై అవగాహన కల్పించారు. మానసిక ఒత్తిడి కారణంగా విద్యార్థులు పరీక్షలకు బయపడి జ్ఞాపకశక్తి కోల్పోతుంటారని, విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండాలని సూచించారు. మానసిక ఒత్తిడికి గురైన వారు 14416 సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సైకియాట్రిక్ నర్స్ పి.మంగమ్మ, ఆరోగ్య సిబ్బంది, ఎఎన్ఎం, హెచ్‌వి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

వేపాడ: ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మండల సమైక్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ యం.ఆనందరావు అన్నారు. స్థానిక మండల సమైక్య కార్యాలయంలో బుధవారం విఒఎలు, ప్రకృతి సిబ్బందికి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం గ్రామస్థాయిలో ఉన్న స్వయం సహాయక సంఘాల ద్వారా నిర్వహిస్తామని మండల సమాఖ్య సిబ్బంది చురుగ్గా పాల్గొని సభ్యులందరినీ ప్రకృతి వ్యవసాయంలోకి మార్చడానికి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఎపిఎం సూర్యనారాయణ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జి సభ్యులు పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయం చేయాలని వారి కుటుంబాలకు అవసరమైన ఉత్పత్తులను మార్కెట్ నుండి కొనడమే కాకుండా వారే స్వయంగా వ్యవసాయం చేసి పండించాలన్నారు. ఈ సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

జెఇఇలో సత్తాచాటిన యోగేశ్వర్

ప్రజాశక్తి - రామభద్రపురం

ఇటీవల ప్రకటించిన జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో ఆరికతోటకు చెందిన జాగాన యోగేశ్వర్ 99.876 పర్సంటైల్ సాధించి సత్తా చాటాడు. యోగేశ్వర్ ప్రాథమిక విద్యాభ్యాసం ఇదే గ్రామ ప్రభుత్వ పాఠశాల్లో కొనసాగించి 7 నుంచి 10వ తరగతి వరకు విశాఖ జిల్లా కొమ్మాది శ్రీచైతన్య స్కూల్లో చదివాడు. ఇంటర్ విజయవాడ శ్రీచైతన్యలో చదివి జెఇఇలో ప్రతిభ చూపాడు. ఇతని తల్లి తండ్రులు ప్రైవేటు స్కూల్‌లో పనిచేస్తూ కుమారుని ఉన్నతికి శ్రమించారు. చిన్నప్పటి నుంచి విద్యపై మక్కువ పెంచుకొని చదువుల్లో రాణించడం విశేషం. ఐఐటి సీటు సంపాదించి కంప్యూటర్ ఇంజనీర్ అవ్వాలని, దీనిలో నూతన ఆవిష్కరణలు కనుగొని ఉన్నతంగా స్థిర పడడమే తన ధ్యేయమని యోగేశ్వర్ తెలిపాడు. తల్లి దండ్రులు, గ్రామంలో ప్రముఖులు ర్యాంకు సాధించిన ఇతనికి మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు.



యోగేశ్వర్



సిద్ధార్థ నాయుడు

జెఇ మెయిన్స్‌లో 97.30 పర్సంటైల్

మెరక ముడిదాం: జెఇ మెయిన్స్ ఫలితాల్లో మండలంలోని ఎం.రావివలస గ్రామానికి చెందిన పిన్నింటి సిద్ధార్థ నాయుడు 97.30 పర్సంటైల్‌తో ఉత్తీర్ణత సాధించాడు. సిద్ధార్థ నాయుడు తండ్రి పిన్నింటి సుగుణ ఆ గ్రామ సర్పంచ్‌గా పనిచేయగా, తల్లి హిరణ్మయి గృహిణిగా ఉన్నారు. తమ కుమారుడు జెఇ మెయిన్స్‌లో మంచి ఉత్తీర్ణత సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

విజయగౌరిని ఎంఎల్‌సిగా గెలిపించాలి

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఈ నెల 27న జరుగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు మీసాల అప్పలనాయుడు కోరారు. ఉపాధ్యాయులందరూ తమ ప్రథమ ప్రాధాన్యత ఓటు విజయగౌరికి వేయాలని పిలుపునిచ్చారు. చీపురుపల్లి టౌన్‌లో బుధవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. మూడు మండలాల ప్రతినిధులు ఓటున్న ఉపాధ్యాయుల ఇళ్ళకు వెళ్ళి పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు దుప్పల భూపతి, చీపురుపల్లి మండలం అధ్యక్షులు నడిపేన బలరాం, గౌరవాధ్యక్షులు మామిడి శ్రీనివాసరావు, మెరకముడిదాం మండలం అధ్యక్షులు మజ్జి హరికృష్ణ, గరివిడి మండలం ప్రధాన కార్యదర్శి కె.గోపాలకృష్ణతో పాటు మూడు మండలాల హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

రూఫ్‌టాప్‌లపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - వంగర

డ్వాక్రా మహిళా సంఘాలలో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి సభ్యులకు గృహ వినియోగం విద్యుత్ భారం తగ్గించేందుకు ప్రభుత్వం అమలు చేయబోతున్న సోలార్ విద్యుత్తు రూఫ్‌టాప్‌లపై గ్రామాల్లో ఉన్న మహిళ సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ ఎ.చిరంజీవి అన్నారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులు, విఒఎలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయితీపై ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌లు అమర్చడానికి ముందుగా ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలను గుర్తిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఎపిఎం మంగమ్మ, స్త్రీనిధి ఇంఛార్జి మేనేజర్ సీతారాం, ఎంఎంఎస్ అధ్యక్షులు బి రామలక్ష్మి, వెలుగు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎ. చిరంజీవి

పనుల్లో నాణ్యత ఉండాలి: పీడీ

ప్రజాశక్తి- రాజాం

ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో చేపడుతున్న పనుల్లో నాణ్యత ఉండాలని డ్వామా పీడీ శారదా దేవి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం ఆమె క్లస్టర్ స్థాయి టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ అనుసంధాన పనులు ఫిష్ పాండ్స్, ఫారం పాండ్స్, మేజిక్ సోకిట్స్, కమ్యూనిటీ సోకిట్స్, హార్టికల్చర్ రైతులకు, ప్రజలకు వీటిపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకు, వికలాంగులకు పూర్తిస్థాయిలో 100 రోజులు పని కల్పించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనుల్లో క్వాలిటీ, క్వాంటిటీ ఉండే విధంగా కూలీలతో పనులను చేయించి కూలీ రూ.300 వచ్చే విధంగా పని చేయించాలని ఆదేశించారు. ప్రతి పనికి విధిగా ఫోన్లో ఫోటోలు, వీడియోలు తీసి భద్రపరుచుకోవాలని, అధికారులు అడిగినప్పుడు వాటిని ఆధారంగా చూపించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ వి. శ్రీనివాసరావు, ఎపిడి ఎం.శ్రీనివాసరావు, సిబి ఎపిడి చిన్నంనాయుడు, టెక్నికల్ అసిస్టెంట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని ఆగూరు పంచాయతీ మధుర గిరిజన గ్రామం కిందగూడెంలో బుధవారం మ్రెండ్లీ పోలీసు కార్యక్రమాన్ని చేపటచేపట్టారు. ఈ సంధర్బంగా ఆండ్ర ఎస్.ఐ కె.సీతారాం మాట్లాడుతూ గిరిజనులలో వెలుగులు నింపడమే లక్ష్యంగా తాను పనిచేస్తున్నానన్నారు. మద్యానికి అలవాటు పడి గిరిజనులు జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలు అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అనంతరం గిరిపుత్రులకు దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజనులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్టెమితో గుండెకు భరోసా

ప్రజాశక్తి - బొబ్బిలి

స్టెమి ఇంజెక్షన్లతో గుండెకు భరోసా అని స్టెమి నోడల్ అధికారి గేదెల శశిభూషణరావు అన్నారు. స్థానిక సిహెచ్‌సిలో బుధవారం స్టెమిపై పిహెచ్‌సి వైద్యులు, ఆశ కార్యకర్తలతో ర్యాలీ చేసి సమావేశం నిర్వహించారు. గుండెపోటుతో ఎవరు మరణించకూడదని ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రిలలో స్టెమి ఇంజెక్షన్లు అందుబాటులోకి తెచ్చిందన్నారు. గుండెపోటు వచ్చిన గంటలోపు ఆసుపత్రికి తీసుకువస్తే ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చునని చెప్పారు. ఈ సమావేశంలో వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీరు వృథా

ప్రజాశక్తి - సంతకవిటి

మడ్డువలస రిజర్వాయర్ నుండి విడుదల చేసిన సాగునీరు మండలంలోని గరికపాడు వద్ద వృథాగా పోతుంది. బుధవారం రిజర్వాయర్ పిల్ల కాలువ గండి కొట్టడంతో సంతకవిటి నుంచి రాజాంకు వెళ్లే ప్రధాన రహదారి మీదుగా సాగునీరు ఏరులై పారింది. మడ్డువలస రిజర్వాయర్ అధికారులు పిల్లకాలువ పై పర్యవేక్షణ లేకుండా నిర్లక్ష్యం వహించడం వల్లే ఎప్పటికప్పుడు కాలువ గండి కొట్టి సాగునీరు వృథా అవుతుందని రైతులు వాపోతున్నారు. దీంతో మండలంలోని శివారు గ్రామాలకు సాగునీరు అందకుండా పోతుందని చెబుతున్నారు. ఇప్పటికే సాగునీరు అందక మొక్కజొన్న, చెరుకు పంటల రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ గండి పడటంతో రహదారిపై ప్రయా ణించే వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. తక్షణమే మడ్డువలస రిజర్వాయర్ అధికారులు స్పందించి సాగునీరు పోకుండా అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

ఉపాధి పనుల పరిశీలన

నెల్లిమర్ల: మండలంలోని తమ్మాపురం చోడిశెట్టి చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను, ఒమ్మి బౌండరీ ట్రెంచ్ పనులను ఎన్ఆర్ఈజిఎస్ క్లస్టర్ ఎపిడి వై.పద్మజ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వేతనదార్లతో మాట్లాడుతూ కొలత ప్రకారం పనులు చేసి వేతనం పొందాలని సూచించారు. వేతనదారులు తప్పనిసరిగా మస్తర్లు, కొలతలు చూసుకొని పనికితగ్గ వేతనం పొందవచ్చున్నారు. ఈ పరిశీలనలో ఆమె వెంట ఎపిఒ జి. అరుణ కుమారి, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

పశువైద్యశాలను సందర్శించిన జెడి

ప్రజాశక్తి- మెరకముడిదాం

స్థానిక పశువైద్యశాలను విజయనగరం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వైవి రమణ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆయన పలు రికార్డ్స్‌ను పరిశీలించారు. సోమలింగాపురంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర దేసీయ గోశాలలో ఉన్న ఆవులన్నింటినీ సందర్శించి పాల పోటీలు గురించి వివరించారు. అర్హులైన వారందరికీ పశుకిసాన్ క్రెడిట్ కార్డ్స్ అందించాలని, రానున్న వేసవి కాలంలో పశు సంవరక్షణలో తీసుకోవలసిన జాగ్రత్త చర్యలు గురించి రైతులకు తెలియజేయాలని, ఉపాధి హామీ పథకం ద్వారా పది సెంట్లు నుండి ఏభై సెంట్లు వరకు పశుగ్రాసమును పెంచుకోవచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి సిహెచ్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసు ఛేదించిన పోలీసులు

విజయనగరంకోట: బొబ్బిలి పట్టణం చిన బజారులో ఫిబ్రవరి 1న రాత్రి జరిగిన చోరీ కేసును ఛేదించి, చోరీకి సహకరించిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, 45 తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేసినట్లు ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. బొబ్బిలికి చెందిన జ్యూవలరీ షాపు యజమాని గ్రంధి రవికుమార్ తన ఇంటి తాళం గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి, ఇంటిలోకి ప్రవేశించి, 45 తులాల బంగారు ఆభరణాలను అపహరించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుల గురించి గాలించి బొబ్బిలి మండలం గున్నతోటవలసకు చెందిన పెంకి శ్రీనివాసరావు, బొబ్బిలికి చెందిన బత్తుల సర్వేశ్వరరావు, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం ముద్దాడకు చెందిన నరసింగరావును అదుపులోకి తీసుకుని విచారించారు. పాత నేరస్థుడు సీతానగరం మండలం, జోగింపేట గ్రామానికి చెందిన పోలా భాస్కరరావుతో కలసి చోరీకి పాల్పడినట్లు అంగీకరించారన్నారు. దొంగిలించిన వస్తువులను అమ్మేందుకు రాయగడ వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారని ఎస్‌పి తెలిపారు. పరారీలో ఉన్న పోలా భాస్కరరావు కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.